


**ఎలాంటి రుసుములు వసూలు చేయకుండా కొండపైకి ఆటోలను అనుమతించాలి**

# ప్రజాపక్షం

## జిల్లా అనుబంధం

నల్లగొండ సూర్యాపేట యాదాద్రి

గురువారం | 26 మార్చి , 2026 | పేజీలు : 06

# గ్రామాలలో తాగునీటి సమస్య రావొద్దు

### సూర్యాపేట జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్



**ప్రజాపక్షం/సూర్యాపేట కలెక్టరేట్ :** రానున్న వేసవి కాలంలో గ్రామాలలో నీటి ఎద్దడి సమస్య రాకుండా చూడాలని సంబంధిత శాఖ అధికారులను జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ ఆదేశించారు. బుధవారం జిల్లా కలెక్టరేట్ కార్యాలయంలో వేసవి కాలంలో నీటి ఎద్దడి సమస్య తలెత్తకుండా నివారణ చర్యలపై డిఆర్‌డిఓ, డిపిఓ, మిషన్ భగీరథ, ఆర్‌డబ్ల్యుఎస్, మండల ప్రజాపరిషత్ అధికారులు, మున్సిపల్ కమిషనర్లతో వెబెక్స్ కాన్ఫరెన్స్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత సంవత్సరం గ్రామాలలో నీటి సమస్య లేకుండా అధికారులు కష్టపడి పని చేశారన్నారు. అదేవిధంగా ఈ సంవత్సరం కూడా వేసవిలో గ్రామాలలో నీటి సమస్య తలెత్తకుండా ప్రతి ఇంటికి సక్రమంగా నీటి సరఫరా అయ్యేలా అధికారులు చర్యలు తీసుకోవాలని సూచించారు. జిల్లాలో ఉన్న 9 వాటర్ ట్రీట్‌మెంట్ ప్లాంట్ల నుండి 818 ఆవాసాలకు నీటి సరఫరా చేయడం జరుగుతుందని మిషన్ భగీరథ అధికారుల నివేదికల ప్రకారం గ్రీన్, ఎల్లో, ఆరెంజ్, రెడ్ కేటగిరిలుగా విభజించి నీటి సరఫరా చేయడం జరుగుతుందని గ్రీన్ కేటగిరిలో రోజుకు ఒక్కో మనిషికి 100 లీటర్ల చొప్పున 692 ఆవాసాలకు, ఆరెంజ్ కేటగిరిలో రోజుకు 80 లీటర్ల చొప్పున 107 ఆవాసాలకు, ఎల్లో కేటగిరిలో రోజుకు 21 నుండి 55 లీటర్ల చొప్పున 11 ఆవాసాలకు, రెడ్ కేటగిరి కింద 8 ఆవాసాలు ఉన్నాయన్నారు. ఆరెంజ్, ఎల్లో, రెడ్ కేటగిరిలో ఉన్న ఆవాసాలను గ్రీన్ కేటగిరిలోకి మార్చేందుకు రూరల్ వాటర్ సప్లయ్, మిషన్ గ్రిడ్ అధికారులు చర్యలు చేపట్టాలని సూచించారు. ఆరెంజ్, ఎల్లో, రెడ్ కేటగిరిలో ఉన్న ఆవాసాల జాబితాను అన్ని మండలాలకు పంపించి నీటి సమస్య తలెత్తకుండా ప్రత్యామ్నాయ చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. శనివారం వరకు అన్ని మండలాల్లో 202627 సంబంధించిన సమ్మర్ యాక్షన్ ప్లాన్‌తో పాటు ప్రత్యామ్నాయ చర్యలపై ప్రణాళికలు సిద్ధంగా ఉండాలన్నారు. పంపులు, పైప్ లైన్ లీకేజీలు, ఓహెచ్ఆర్‌లలో లీకేజీలను గుర్తించడం జరిగిందని అధికారులు ప్రయారిటి కింద మోటర్ల రిపేర్లు, హ్యాండ్ పంపుల రిపేర్లు చేయించాలని సూచించారు. గ్రామ పంచాయితీ స్థాయిలో క్లోరినైజేషన్ కోసం బ్లీచింగ్ ఫౌడర్ అందుబాటులో ఉంచుకోవాలని ఆదేశించారు. ప్రతి గ్రామ పంచాయితీకి మంచి నీటి సహాయకుడిని నియమించి వారికి శిక్షణ ఇవ్వడం జరిగిందని వారు అందుబాటులో ఉండాలని ఆదేశించారు. ఎట్టి పరిస్థితిలో ఒక్కరోజు కూడా గ్రామాలకు మంచినీటి సరఫరా ఆగేది లేదని ఇందుకోసం అధికారులు పకడ్బందీగా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ కె సీతారాములు, జిల్లా పరిషత్ సిఈఓ శిరీష, డిపిఓ యాదగిరి, మిషన్ భగీరథ ఈఈ కరుణాకర్‌రెడ్డి, ఆర్‌డబ్లుఎస్ ఈఈ శ్రీనివాసరావు, మున్సిపల్ కమిషనర్ హన్మంతరెడ్డి, ఇతర అధికారులు పాల్గొన్నారు.

# వేధింపుల ఆరోపణలు & మీడియాపై బెదిరింపులు

### ‘లివింగ్ ట్రీ డిస్కవరీ హైస్కూల్’ వివాదంలో సంబంధిత శాఖ ఉన్నతాధికారులు మౌనం వీడేనా?

**ప్రజాపక్షం/ఆలేరు :** ఆలేరు మండలం మందనపల్లి గ్రామంలోని లివింగ్ ట్రీ డిస్కవరీ హై స్కూల్ లో మహిళా టీచర్లపై వేధింపుల ఆరోపణలు, అనంతరం మీడియాపై బెదిరింపుల ఘటనలు కలగలిపి తీవ్ర వివాదానికి దారి తీస్తున్నాయి. ఈ వ్యవహారం ఇప్పుడు చట్టపరమైన దర్యాప్తు దిశగా మలుపు తిరిగే సూచనలు కనిపిస్తున్నాయి. టీచర్ల వేధింపుల ఆరోపణలు వెలుగులోకి వచ్చినప్పటికీ, యాజమాన్యం నుంచి స్పష్టమైన సమాధానం రాకపోవడం గమనార్హం. దీనికి విరుద్ధంగా, బాధితులపైనే అసత్య ఆరోపణలు మోపడం, అనుచిత వ్యాఖ్యలు చేయడం పరిస్థితిని మరింత సంక్లిష్టం చేస్తున్నట్లు తెలుస్తోంది. ఈ నేపథ్యంలో స్కూల్ డైరెక్టర్ అభిలాష కర్నాటి చేసిన వ్యాఖ్యలు కూడా వివాదానికి కారణమయ్యాయి. బుధవారం నిర్వహించిన ప్రెస్ మీట్లో ప్రధాన ఆరోపణలపై స్పష్టత ఇవ్వాల్సిన స్థానంలో, వాటిని పూర్తిగా పక్కనబెట్టడం అనేక అనుమానాలకు తావిస్తోంది. మహిళలపై వేధింపుల ఆరోపణలు వచ్చినప్పుడు, వాటిపై పారదర్శక విచారణ జరపకపోవడం లేదా బాధితులపై ఒత్తిడి తేవడం విమెన్ అట్ వర్క్ప్లేస్ ప్రొటెక్షన్ చట్టం ఉల్లంఘనగా పరిగణించబడే అవకాశముందని న్యాయ నిపుణులు సూచిస్తున్నారు. నిజాలను దాచిపెట్టే ప్రయత్నాలు ఎంత చేసినా& చట్టం ముందు అవి నిలవవన్నది స్పష్టమే.ఇకనైనా యాదాద్రి జిల్లా సంబంధిత శాఖ ఉన్నతాధికారులు కలుగజేసుకొని ఈ వ్యవహారంపై సమగ్ర విచారణ చేపట్టాలని పలువురు మాజీ టీచర్లు, విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

# శాసనసభ స్పీకర్‌ను కలిసిన వేముల వీరేశం

### విప్‌గా నియామకంపై శుభాకాంక్షలు- అభివృద్ధి అంశాలపై చర్చ



**ప్రజాపక్షం/నకిరేకల్ :** ప్రభుత్వ విప్‌గా నియమితులైన సందర్భంగా నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం బుధవారం తెలంగాణ శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు.ఈ సందర్భంగా ఆయనకు పుష్ప గుచ్ఛం అందజేసి,కొత్త బాధ్యతల పట్ల శుభాకాంక్షలు తెలిపారు. ఈ భేటీలో రాష్ట్ర శాసనసభ వ్యవహారాలు,ప్రజా సమస్యల పరిష్కారం,అభివృద్ధి కార్యక్రమాలపై సానుకూల చర్చలు జరిగినట్లు సమాచారం. ప్రజలకు మెరుగైన సేవలు అందించడంలో శాసనసభ పాత్ర కీలకమని,పరస్పర సహకారంతో అభివృద్ధి కార్యక్రమాలను ముందుకు తీసుకెళ్లాలని అభిప్రాయపడ్డారు.వేముల వీరేశం మాట్లాడుతూ ప్రభుత్వం తమపై ఉంచిన విశ్వాసానికి తగిన విధంగా విప్‌గా తన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వర్తిస్తానని తెలిపారు. ప్రజల సమస్యలను శాసనసభ దృష్టికి తీసుకెళ్లి, పరిష్కారానికి కృషి చేస్తానన్నారు.ఈ కార్యక్రమంలో మిర్యాలగూడ ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి కూడా పాల్గొన్నారు.

# హోటళ్లలో డొమెస్టిక్ సిలిండర్లు స్వాధీనం

**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్:** నల్లగొండ పట్టణంలో పౌర సరఫరాల శాఖ అధికారులు బుధవారం పలు హోటళ్లలో ఆకస్మిక తనిఖీలు నిర్వహించి డొమెస్టిక్ గ్యాస్ సిలిండర్లను స్వాధీనం చేసుకున్నారు.ఈ తనిఖీలకు ఎన్ఫోర్స్మెంట్ డిప్యూటీ తహసీల్దార్ మాచన రఘునందన్ నాయకత్వం వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇళ్లలో వినియోగించాల్సిన డొమెస్టిక్ గ్యాస్ సిలిండర్లను వాణిజ్య అవసరాలకు ఉపయోగించడం చట్ట విరుద్ధమని స్పష్టం చేశారు. హోటళ్లలో డొమెస్టిక్ సిలిండర్ల వినియోగం నేరమని, ఇలాంటి చర్యలపై కఠినంగా వ్యవహరిస్తామని హెచ్చరించారు.తనిఖీల్లో నల్లగొండ పట్టణంలోని పలు ప్రాంతాల్లో హోటళ్లలో వాడుతున్న డొమెస్టిక్ సిలిండర్లను గుర్తించి స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.ఇకపై హోటల్ యజమానులు డొమెస్టిక్ సిలిండర్ల వినియోగాన్ని పూర్తిగా నిలిపివేసి,కమర్షియల్ గ్యాస్ సిలిండర్లను మాత్రమే వినియోగించాలని సూచించారు. ఈ తనిఖీల్లో టి.వెంకటేష్‌తో పాటు పలువురు అధికారులు పాల్గొన్నారు.

# నందికొండ మున్సిపాలిటీ బడ్జెట్‌కు గ్రీన్ సిగ్నల్

### రూ.2647 లక్షలతో అభివృద్ధి బాట -కౌన్సిల్ ఏకగ్రీవ ఆమోదం



**ప్రజాపక్షం/నందికొండ:** నందికొండ పురపాలక సంఘం 2026/27 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన బడ్జెట్‌కు కౌన్సిల్ ఏకగ్రీవంగా గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది.స్థానిక పురపాలక సంఘ కార్యాలయంలో బుధవారం నిర్వహించిన బడ్జెట్ సమావేశానికి చైర్‌పర్సన్ మానస స్వర్ణ అధ్యక్షత వహించారు.ఈ సందర్భంగా రూ. 2647 లక్షల అంచనా ఆదాయం,అదే స్థాయిలో వ్యయంతో రూపొందించిన బడ్జెట్‌ను సభ్యులు సమగ్రంగా పరిశీలించారు.అనంతరం సభ్యులు తమ అభిప్రాయాలు,సూచనలు వెల్లడించి,చివరికి బడ్జెట్‌ను ఏకగ్రీవంగా ఆమోదించారు.పట్టణ అభివృద్ధి దిశగా మౌలిక వసతుల విస్తరణ, తాగునీటి సరఫరా మెరుగుదల, పారిశుద్ధ్య నిర్వహణ, రహదారుల అభివృద్ధి వంటి కీలక రంగాలపై ఈ బడ్జెట్ ప్రత్యేక దృష్టి సారించినట్లు అధికారులు తెలిపారు. ప్రజల అవసరాలను దృష్టిలో ఉంచుకొని రూపుదిద్దుకున్న ఈబడ్జెట్ నందికొండ పట్టణానికి మరింత అభివృద్ధి దిశగా దోహదం చేస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు.ఈ సమావేశంలో మున్సిపల్ కమిషనర్ అశోక్ రెడ్డి,వైస్ ఛైర్మన్,కౌన్సిల్ సభ్యులు పాల్గొన్నారు.



## బాలసదన్‌లో మంచి వసతులతో ఆశ్రమ నిర్వహణ చేయాలి

**ప్రజాపక్షం/భువనగిరి :** జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ, యాదాద్రి భువనగిరి అధ్యక్షులు, జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఎ.జయరాజు సూచనల మేరకు సంస్థ కార్యదర్శి వి.మాధవి లత భువనగిరిలోని బాలసదన్‌ను సందర్శించారు. బాల సదన్‌లోని బాలికలతో ముఖాముఖి జరిపి వారికి కల్పిస్తున్న వసతులను పరిశీలించి, బాలసదన్‌లోని సిబ్బందితో మాట్లాడుతూ బాలికలకు మంచి వసతులతో ఆశ్రమ నిర్వహణ చేయాలని, వారి ఆరోగ్యంపై తగు జాగ్రత్తగా వ్యవహారించాలని, వారి అభిరుచిని బట్టి ఆటలు, పాటలు, చిత్రలేఖనం, వ్యాసరచన, ప్రసంగం అంశాలలో , జీవిత నైపుణ్యాలలో మంచి శిక్షణ కల్పించేలా చర్యలను శాఖపరంగా పరిమితులను అనుసరించి తీసుకోవాలని బాలసదన్ సిబ్బందికి తగు సూచనలు చేశారు.

## నూతన వస్త్రాలంకరణ



**ప్రజాపక్షం/రామన్నపేట :** రామన్నపేట మండలం లక్ష్మాపురం గ్రామానికి చెందిన టిఆర్ఎస్ పార్టీ యువ నాయకుడు ఉప్పాగుల కిరణ్ కుమార్ గౌడ్ కూతురు పట్టు వస్త్రాలంకరణ కార్యక్రమం గురువారం సాయిరాం ఫంక్షన్ హాల్‌లో జరగగా ఇట్టి కార్యక్రమమునకు మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య హాజరై చిన్నారులను ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ మండల అధ్యక్షుడు పోషబోయిన మల్లేశం, లక్ష్మాపురం సర్పంచ్ పులిపలుపుల సునీత వీరస్వామి, జిల్లా నాయకుడు బద్దుల రమేష్, మాజీ కోఆప్షన్ నెంబర్ ఎండి అమీర్, యువజన విభాగం మండల అధ్యక్షుడు వెంకన్న పాల్గొన్నారు.

## ఇంపాక్ట్ మోటివేషనల్ స్పీకర్‌గా వెంకటేశం గౌడ్



**ప్రజాపక్షం/రామన్నపేట :** రామన్నపేట మండలం ఇంద్రపాలనగరం గ్రామానికి చెందిన మల్లం వెంకటేశం గౌడ్ ఇంపాక్ట్ ఇంటర్నేషనల్ ఆధ్వర్యంలో మోటివేషనల్ స్పీకర్‌గా శిక్షణ పొంది నల్గొండలోని ఒక ప్రైవేటు హోటల్లో జరిగిన కార్యక్రమంలో ఇంపాక్ట్ ఇంటర్నేషనల్ ఫౌండర్ గంపా నాగేశ్వర్ రావు చేతుల మీదుగా సర్టిఫికెట్ అందుకున్నారు. ఈ కార్యక్రమంలో నల్గొండ జిల్లా ఇంపాక్ట్ హెడ్ బోర్డు మెంబెర్ నూనె సుదర్శన్, నల్గొండ రీజియన్ 2 ప్రెసిడెంట్ కోట్ల సాయి కిరణ్, కోటా కవిత నారాయణ, సరిత గూడూరు అంజిరెడ్డి, వీరవెల్లి శ్రీలత, హర్షిత, రవీంద్ర రెడ్డి, నందికొండ రవీంద్ర చారి, బాలు, సరిత మొదలగు 30 మంది ట్రైనర్లు పాల్గొన్నారు.

## మైనారిటీ రెసిడెన్షియల్ స్కూల్ తనిఖీ



**ప్రజాపక్షం/యాదాద్రి :** తెలంగాణ మైనారిటీ రెసిడెన్షియల్ స్కూల్ , జూనియర్ కళాశాలను జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ ఎం.మనోహర్ ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన వంటగదిని, స్టోర్ రూమ్‌ను బోధనశాలను మరియు విద్యార్థులను అడిగి వివరాలన్నీ తెలుసుకున్నారు. పిల్లలతో కలిసి భోజనం చేశారు. ఆయన మాట్లాడుతూ హాస్టల్లో ఉన్న విద్యార్థులకు పౌష్టికాహారంతోపాటు వ్యక్తిగత పరిశుభ్రత ఎంతో అవసరమని మరియు వారికి ఆరోగ్య విద్యా బోధన చేశారు. పిల్లలు మానసిక ఒత్తిడి పరీక్షల పై భయం పడకుండా టెలి మానస్ సర్వీసులను సద్వినియోగం చేసుకోవాలని సిబ్బందిని కోరారు. తదనంతరము సిబ్బందితో మాట్లాడారు. పిల్లలను జాగ్రత్తగా అన్ని ఆరోగ్య పరీక్షలు చేయించుకోవాలని తమ వైద్య సిబ్బందికి సహకారం అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఇన్చార్జ్ ప్రిన్సిపాల్ యాకయ్య, వార్డెన్ మాజాయిద్దీన్, పల్లె దవాఖాన వైద్యుడు డాక్టర్ మురళీమోహన్, సురేష్ కుమార్ పాల్గొన్నారు.

## బిఆర్ఎస్ పార్టీలోకి భారీ చేరికలు



**ప్రజాపక్షం/యాదగిరిగుట్ట :** యాదగిరిగుట్ట పట్టణంలో రాజకీయ సమీకరణాలు వేగంగా మారుతున్నాయి. బుధవారం పట్టణంలోని 2వ వార్డుకు చెందిన మోతే నరసింహ నాయకత్వంలో వివిధ పార్టీలకు చెందిన సుమారు 100 మంది కార్యకర్తలు, నాయకులు బీఆర్ఎస్ పార్టీలో చేరారు. వీరికి ఎన్ డీసీసీబీ మాజీ చైర్మన్, బీఆర్ఎస్ రైతు విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గొంగిడి మహేందర్ రెడ్డి గులాబీ కండువాలు కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు కర్రె వెంకటయ్య, పట్టణ సెక్రటరీ జనరల్ పాపట్ల నరహరి, యువజన విభాగం పట్టణ అధ్యక్షుడు ముక్కెర్ల సతీష్ యాదవ్, నాయకులు బాలయ్య గౌడ్, రాజేష్ యాదవ్, నర్సింగం, పురుషోత్తం, మోతే బాలు తదితరులు హాజరయ్యారు. మోతే నరసింహతో పాటు మోతే విజయ్, శ్రీరాములు, తూర్పాటి బాల నరసింహ, తూర్పాటి శంకర్, మిర్యాల నాగార్జున, కళ్యాణ్, దావీద్, సల్ల ప్రవీణ్, మోతే స్వామి, కళ్లెం మల్లేష్, పరశురాం పాల్గొన్నారు.

## సామాజిక న్యాయమే కాంగ్రెస్ పార్టీ ధ్యేయం



**ప్రజాపక్షం/భువనగిరి :** సామాజిక న్యాయమే కాంగ్రెస్ పార్టీ ధ్యేయం అని, అన్ని వర్గాలకు సముచిత న్యాయం కాంగ్రెస్ పార్టీలోకే సాధ్యమని జిల్లా గ్రంధాలయ సంస్థ చైర్మన్ ఎండి అవేస్ ఉర్ రెహమాన్ చిస్తి అన్నారు. భువనగిరి పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఇటీవల ఎన్నికైన జిల్లా కాంగ్రెస్ కమిటీ కార్యవర్గ సభ్యులకు, నూతన కౌన్సిలర్‌గా ఎన్నికైన దళిత మైనార్టీ వర్గాల ప్రతినిధులకు సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఇటీవల కౌన్సిలర్‌గా గెలుపొందిన ఎస్సి , మైనారిటీ కౌన్సిల్లోర్‌లను కూడ సన్మానించారు. ఈ కార్యక్రమంలో బట్టు రాంచంద్రయ్య, బాబు రావు, హరిప్రసాద్, మజహర్, చుక్క స్వామి, షఫీక్ అహ్మద్, బబ్లు, జహంగీర్, అక్తర్ బుర్హాన్, విగ్నేష్, బొంత నర్సింహా, ఈరపాక నర్సింహా, కొల్లూరి రాజు, పడిగేలా ప్రదీప్, షరీఫ్, ఇబ్రహీం పాల్గొన్నారు.

## విజయానికి శ్రమయే మార్గం




**ప్రజాపక్షం/సూర్యాపేట టౌన్ :** విజయానికి అడ్డదారులు ఉండవని కేవలం శ్రమయే విజయానికి మార్గమని జిల్లా ఎస్‌పి కె నరసింహ అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలోని స్పందన డిగ్రీ, పిజి కళాశాల వార్షికోత్సవం సందర్భంగా కళాశాల యాజమాన్యం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా హాజరై జ్యోతిప్రజ్వలన చేసి ప్రసంగించారు. ఎంచుకున్న లక్ష్యం సాధించడానికి మంచి ప్రణాళికతో ముందుకు వెళ్లాలని అంశాలపై విషయ పరిజ్ఞానం కలిగి ఉండాలన్నారు. గొప్ప విజయాలు సాధించిన వారి విజయగాతలను ఆదర్శంగా తీసుకోవాలని అబ్దుల్ కలాం జీవితాన్ని ఉద్దేశించి వివరించారు. కష్టపడి చదువుకునే సమయంలో యువత ఆకర్షణలకు గురై బంగారు భవిష్యత్తును కోల్పోవద్దని, చెడు అలవాట్లకు లోనూ కావద్దని కోరారు. ఈ కార్యక్రమంలో కళాశాల యాజమాన్యం కరస్పాండెంట్ శ్రీనివాస్ రెడ్డి, ప్రిన్సిపాల్ సైదారావు, వాసుదేవరావు, వేణుగోపాల్, నాగిరెడ్డి, మారం వెంకట్‌రెడ్డి, యాదవరెడ్డి, సత్యంబాబు, భగవాన్ రెడ్డి, విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## నేడు పేటలో సోమనాథ్ జ్యోతిర్లింగ దర్శనం

**ప్రజాపక్షం/సూర్యాపేట కలెక్టరేట్ :** భారతదేశంలోని జ్యోతిర్లింగాలలో మొదటిదైన వెయ్యి సంవత్సరాల చరిత్ర గల సోమనాథ్ జ్యోతిర్లింగ దర్శనాన్ని నేడు (గురువారం) జిల్లా కేంద్రంలోని షిరిడి సాయి బాబా దేవాలయం వద్ద గల రవి మహల్ కన్వెన్షన్ నందు ప్రజల సందర్శనార్థం ఏర్పాటు చేస్తున్నట్లు హార్ట్ ఆఫ్ లివింగ్ సభ్యులు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. సోమనాథ్ జ్యోతిర్లింగ ఆలయాన్ని గజని మహ్మద్ ధ్వంసం చేసిన తర్వాత అందులోని మూల విరాట్ జ్యోతిర్లింగాన్ని అగ్నిహోత్రి బ్రాహ్మణులు గోప్యంగా దాచి ఇప్పటి వరకు పూజలు నిర్వహిస్తున్నారని వివరించారు. అట్టి జ్యోతిర్లింగం నేటి వరకు మన కళ్ళకు అందనిదన్నారు. ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు.



## సిఎం రిలీఫ్ ఫండ్ పేదలకు వరం

**ప్రజాపక్షం/సూర్యాపేట కలెక్టరేట్ :** సిఎం రిలీఫ్ ఫండ్ పేదలకు వరమని తెలంగాణ రాష్ట్ర పర్యాటక అభివృద్ధి సంస్థ చైర్మన్ పటేల్ రమేష్ రెడ్డి అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలోని ఆయన నివాసంలో 24 మంది లబ్ధిదారులకు రూ.9,26,500 విలువైన చెక్కులను పంపిణీ చేసి మాట్లాడారు. గత 20 నెలల్లో మా తరపున 98 మంది లబ్ధిదారులకు దాదాపు రూ.40,25,500 అందించామని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ షఫీ ఉల్లా, మార్కెట్ కమిటి వైస్ చైర్మన్ గట్టు శ్రీనివాస్, కౌన్సిలర్ కొనతం రాజేష్ రెడ్డి, జ్యోతి కరుణాకర్, వల్దాస్ దేవేందర్, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

## సర్టిఫికెట్స్ అందజేత




**ప్రజాపక్షం/రామన్నపేట :** స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో కంప్యూటర్ సైన్స్ విభాగం , టిఎస్‌కేసి ఆధ్వర్యంలో నిర్వహించిన ఉమెన్ అండ్ ఎఐ కోర్స్ పూర్తి చేసిన విద్యార్థులకు సర్టిఫికెట్ ప్రదాన కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి అధ్యక్షత వహించిన కళాశాల ప్రధానాచార్యులు ఆచార్య రాహత్ ఖానం మాట్లాడుతూ ఆధునిక ప్రపంచంలో కంప్యూటర్ సైన్స్ ప్రాధాన్యత ఎంతో ఉన్నదని, ఉపాధి కల్పనలో కంప్యూటర్ కోర్స్ ఎంతో ఉపయోగపడుతున్నదని, కంప్యూటర్ రానివారు ఎంత విద్యావంతులైనా నిరక్షరాస్యులుగానే పరిగణించాల్సిన అవసరం ఏర్పడిందని అన్నారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ పి.వెంకటేశ్వరరావు, ఐక్యుఏసి కోఆర్డినేటర్ డాక్టర్ లక్ష్మి నీలిమ, కంప్యూటర్ కోర్స్ శిక్షకులు జి.సంజీవులు, అధ్యాపకులు డాక్టర్ జి.సునీత, డాక్టర్ తండు కృష్ణ కౌండిన్య, విద్యార్థులు పాల్గొన్నారు.

## వెల్లంకి విద్యార్థుల ప్రభంజనం



**ప్రజాపక్షం/రామన్నపేట :** ఇటీవల జరిగిన తెలంగాణ గురుకుల సెట్ 2026 సంవత్సరం 5వ తరగతికి జరిగిన ప్రవేశ పరీక్షల్లో మండలంలోని వెల్లంకి గ్రామ మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల నుండి పదిమంది విద్యార్థులు పరీక్ష రాయగా మొదటి విడతలోనే పదిమంది విద్యార్థులు వివిధ గురుకుల పాఠశాలలో సీట్లు సాధించారు. ఈ విద్యార్థులను గ్రామ సర్పంచ్ ఈడెం రాధా శ్రీనివాస్ మరియు అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ చైర్ పర్సన్ పులగం సులోచన విద్యార్థులకు అభినందనలు తెలియజేశారు. విద్యార్థుల విజయానికి కృషి చేసిన పాఠశాల ఉపాధ్యాయులు ఇట్టే సోమిరెడ్డి, ఉయ్యాల బిక్షమయ్య, దూదిగాను సువర్ణ, మందుగుల వెంకటయ్య, కొసనం మాధవి, విద్యా వాలంటీర్లు నకిరేకంటి అశ్విని, వనం రాజేశ్వర్ ను పాఠశాల ప్రధానోపాధ్యాయులు పల్లె మోహన్ రెడ్డి అభినందించారు.

## మద్యం మత్తులో వాహనాలు నడపొద్దు

**ప్రజాపక్షం/సూర్యాపేట టౌన్ :** మద్యం మత్తులో వాహనాలు నడపడం ప్రమాదం చట్టరీత్యా నేరమని సూర్యాపేట పట్టణ సిఐ వెంకటయ్య హెచ్చరించారు. బుధవారం ట్రాఫిక్ పోలీసుల ఆధ్వర్యంలో కొత్తబస్టాండ్ వద్ద ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా రక్షణ అంశాల పట్ల ప్రజలకు అవగాహన కల్పిస్తూ అరైవ్ అలైవ్ రోడ్డు భద్రత కార్యక్రమం నిర్వహించారు. ట్రాఫిక్ ఎస్ఐ సాయిరాం మాట్లాడుతూ పట్టణంలో నిత్యం మద్యం మత్తు తనిఖీలు నిర్వహిస్తూ కేసులు నమోదు చేస్తున్నామని వివరించారు. ఈ కార్యక్రమంలో ట్రాఫిక్ సిబ్బంది, వాహనదారులు పాల్గొన్నారు.



## సమస్యలను అసెంబ్లీలో ప్రస్తావించాలని వినతి

**ప్రజాపక్షం/సూర్యాపేట టౌన్ :** సమ్మె చేస్తున్న ఆశాల సమస్యలను అసెంబ్లీలో ప్రశ్నించి వేతనం పెంపుదలకు సూర్యాపేట శాసనసభ్యులు గుంటకండ్ల జగదీష్‌రెడ్డి ప్రభుత్వంపై ఒత్తిడి తేవాలని బిఆర్‌టియు జిల్లా అధ్యక్షులు వెంపటి గురూజీ అన్నారు. బుధవారం ఆశా వర్కర్ల యూనియన్ ఆధ్వర్యంలో సూర్యాపేట ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో కార్యాలయ కార్యదర్శికి మెమోరాండం ఇచ్చిన అనంతరం ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల మేనిఫెస్టోలో చెప్పిన విధంగా రూ.18వేల కనీస వేతనం ఇవ్వాలని, ఉద్యోగ భద్రత కల్పించి పారితోషికం కాకుండా ఫిక్స్‌డ్ వేతనం అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఆశాల యూనియన్ నాయకురాలు జయమ్మ, సక్కుబాయి, బైనా బాయి, మరియమ్మ, విజయలక్ష్మి , నవ్య పాల్గొన్నారు.

## ఇందిరమ్మ ఇల్లు ప్రారంభం



**ప్రజాపక్షం/మర్రిగూడ:** మండలంలోని కొట్టాల గ్రామపంచాయతీలో ప్రభుత్వం మంజూరు చేసిన ఇందిరమ్మ ఇల్లు నిర్మాణం పూర్తి కావడంతో, లబ్ధిదారుడు గంట అంజయ్య కొత్త ఇంటిని బుధవారం ఘనంగా ప్రారంభించారు.ఈ కార్యక్రమానికి గ్రామ సర్పంచ్ కల్లెట్ల లింగయ్య ముఖ్య అతిథిగా హాజరై,ఎంపీడీవో సీజీ మున్నయ్య, హౌసింగ్ ఏఈ ఈశ్వర్‌తో కలిసి ఇంటిని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి షేక్ సయ్యద్,ఉప సర్పంచ్ నర్సమ్మ, వార్డు సభ్యులు బుర్ర రమణమ్మ,గంట రాజు,సైదులు, సంతోష్,ప్రవీణ్ పాల్గొన్నారు.

## బంకుల వద్ద వాహనదారుల క్యూలు

**ప్రజాపక్షం/మర్రిగూడ:** ఇరాన్,అమెరికా,ఇజ్రాయిల్ దేశాల మధ్య నెలకొన్న ఉద్రిక్త పరిస్థితుల నేపథ్యంలో సోషల్ మీడియాలో వ్యాపిస్తున్న పుకార్లను నమ్మి ప్రజలు పెట్రోల్,డీజిల్ కోసం బంకుల వద్దకు భారీగా తరలివస్తున్నారు.పశ్చిమ ఆసియాలో యుద్ధ ప్రభావంతో ఇంధన కొరత ఏర్పడుతుందన్న ప్రచారం కారణంగా మర్రిగూడ ప్రాంతంలోని పెట్రోల్ బంకుల వద్ద వాహనదారుల రద్దీ గణనీయంగా పెరిగింది.బుధవారం ఉదయం నుంచే బంకుల వద్ద వాహనదారులు బారులు తీరడంతో,కొంతసేపు ట్రాఫిక్‌కు అంతరాయం కలిగింది.ఒక్కసారిగా డిమాండ్ పెరగడంతో ఇంధనం నింపించుకోవడానికి ప్రజలు తొందరపడుతూ క్యూలలో నిలబడ్డారు.అధికారులు ప్రజలను అప్రమత్తంగా ఉండాలని, సోషల్ మీడియాలో వచ్చే నిర్ధారణ లేని సమాచారాన్ని నమ్మకుండా జాగ్రత్తగా వ్యవహరించాలని కోరుతున్నారు.



# వ్యాలిడేషన్ చట్టాన్ని వెంటనే రద్దు చేయాలి

**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్:** పెన్షనర్ల ప్రయోజనాలకు విరుద్ధంగా పార్లమెంటు ఆమోదించిన వ్యాలిడేషన్ చట్టాన్ని వెంటనే ఉపసంహరించుకోవాలని పెన్షనర్ల జేఏసీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పన్నాల గోపాల్ రెడ్డి కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.ఆల్ ఇండియా స్టేట్ పెన్షనర్ల ఫడరేషన్ పిలుపు మేరకు జిల్లా కలెక్టర్ కార్యాలయం ముందు బుధవారం నిర్వహించిన ధర్నా శిబిరంలో ఆయన పాల్గొని ప్రసంగించారు.గత సంవత్సరం మార్చి 25న కేంద్ర ప్రభుత్వం దొంగచాటుగా వ్యాలిడేషన్ చట్టాన్ని ఆమోదించడం తీవ్రంగా ఖండనీయమని,ఇటువంటి చీకటి ఉత్తర్వులు ప్రజాస్వామ్యానికి విరుద్ధమని అన్నారు. 2004లో పాత పెన్షన్ పథకం స్థానంలో సిపిఎస్ ప్రవేశపెట్టి ఇప్పటికే ప్రభుత్వ ఉద్యోగుల భవిష్యత్తును దెబ్బతీసిన కేంద్ర ప్రభుత్వం, ఇప్పుడు మరోసారి పెన్షనర్లపై కొరడా దులిపిందని మండిపడ్డారు. ఈ కార్యక్రమంలో వివిధ పెన్షన్ సంఘాల నాయకులు డి.భాస్కర్ రెడ్డిశ్యాంసుందర్,బిక్షపతి,లక్ష్మారెడ్డి,ప్రభాకర్,రామయ్య తదితరులు పాల్గొన్నారు.

# డ్రగ్స్ మత్తు పదార్థాలకు బానిసలు అయితే అవమానం




**ప్రజాపక్షం/హాలియా:** సమాజంలో డ్రగ్స్,మత్తు పదార్థాలు యువతపై పెను ప్రభావం చూపుతూ దానికి బానిసలై జీవితాలను చిన్నాభిన్నం చేసుకుంటున్న వారిని మేల్కొల్పేందుకు బ్రాహ్మణ వేషాధారణతో ఒక సామాజి కార్యక్రమం చేస్తున్న వినూత్న ప్రయత్నం పలువురిని ఆకట్టుకుంటుంది. దీనికి సంబంధించిన సమాచారం ప్రకారం సూర్యాపేట జిల్లా కేంద్రానికి చెందిన సామాజిక కార్యకర్త తెలుగు పండితులు రాచకొండ ప్రభాకర్ బ్రాహ్మణ వేషధారణలో పంచాంగ పఠనం పేరుతో ఆయా రాశుల వారికి ఈ ఉగాది తర్వాత ఎలా ఉందో చెబుతూ అందులో డ్రగ్స్ మత్తు పదార్థాలు వాడే వారికి సమాజంలో ఎలాంటి పేరు ప్రతిష్టలు వస్తాయో చెబుతున్న తీరు ఆకట్టుకుంది.బుధవారం హాలియా బస్టాండ్ ప్రాంతంలో ఉగాది పంచాంగ పఠనం చేశారు. ఇందులో శ్రీ పరాభనామ సంవత్సరంలో గంజాయి, డ్రగ్స్, మత్తు పదార్థాలకు బానిసలు అయితే అవమానం ఎక్కువ, రాజ్యపూజం తక్కువ, వ్యయం ఎక్కువ, ఆదాయం తక్కువ, సమాజంలో గౌరవ మర్యాదలు మరింత తగ్గిపోతాయని చెబుతున్నారు.

# ప్రమాదాల నివారణకే అక్రమ దారులు తొలిగింపు



**ప్రజాపక్షం/హాలియా:** మున్సిపాలిటీ కేంద్రమైన హాలియా రహదారుల వెంట కొందరు షాపు యజమానులు తమ షాపుల వద్ద మట్టితో ఏర్పాటు చేసుకున్న దారులను మున్సిపాలిటీ ఆధ్వర్యంలో వాటిని తొలగించే కార్యక్రమాన్ని ప్రారంభించారు.మున్సిపల్ చైర్మన్ చింతల చంద్రారెడ్డి ఆధ్వర్యంలో బుధవారం హాలియా సెంటర్ నుండి రామాలయం వరకు షాపుల వద్ద ఏర్పాటు చేసుకున్న మట్టి దారులను సిబ్బందితో తొలగించి వెంటనే మట్టిని అక్కడి నుండి ట్రాక్టర్ల ద్వారా తరలించారు. ఎవరి షాప్ వద్ద వారు ఒక మట్టి దారిని ఏర్పాటు చేసుకోవడం వలన పలు ప్రమాదాలు జరుగుతున్నాయి. జాతీయ రహదారిపై ఇరువైపులా మట్టి పేరుకుపోయి వర్షం వస్తే దానిపైనే నీరు నిలబడి పలు ప్రమాదాలకు కారణం అవుతుంది. కొంతమంది వ్యాపారులు దారులను ఆక్రమించుకొని చిరు వ్యాపారులు చేయడం ప్రమాదాలకు మరింత ఆజ్యం పోసినట్లుగా ఉంది. దీనిపై దృష్టి సారించి మున్సిపల్ చైర్మన్ చంద్రారెడ్డి తమ సిబ్బందితో పాటు అందరు కౌన్సిలర్లు ఈ ఆక్రమాలను తొలగించి ప్రమాదాలు నివారించాలనే తలంపుతో ఈ ఆక్రమణల తొలగింపుకు శ్రీకారం చుట్టారు. మున్సిపల్ కమిషనర్ రవీందర్ రెడ్డి అంగడి బజారులో పర్యటించి ఆక్రమణలకు గురైన ప్రాంతాలను తక్షణం తొలగించుకోవాలని సంబంధిత వ్యాపారులకు సూచించారు.

# రికార్డు సృష్టించిన కొండమల్లేపల్లి సంత వేలం పాట



**ప్రజాపక్షం/కొండమల్లేపల్లి;** కొండమల్లేపల్లి గ్రామ పంచాయతీ కార్యాలయ ఆవరణలో బుధవారం నిర్వహించిన సంత బహిరంగ వేలం పాటలో మొత్తం 25 మంది వేలం పాటలో పాల్గొనగ కల్వకుర్తికి చెందిన వర్కాల భాస్కర్‌రెడ్డి 3కోట్ల 80లక్షల ఒక వేయి రూపాయలు వేలం పాట పాడి రికార్డు సృష్టించి, కేవలం ఒక సంవత్సరం కాలపరిమితికే సంతను దక్కించుకున్నాడు. రసవత్తరంగా సాగిన సంత వేలం పాటలో పాట ప్రారంభంలో సర్కారి వారి పాట 1కోటి 26లక్షల 60వేల 43రూపాయలతో ప్రారంభమయి చివరికి రికార్డు స్థాయిలో 3కోట్ల 80లక్షల ఒక వేయి రూపాయలతో ముగిసింది. సంత వేలం పాటలో ఇంచార్జ్ డిపిఓ శంకర్‌నాయక్ పంచాయతీ రాజ్ నిబంధనల ప్రకారం సంత యొక్క నియమ నిబంధనలను సభ్యులందరికి పూర్తిగా వివరించారు. సంత వేలం పాట అనంతరం ఆయన మాట్లాడుతూ తెలంగాణలో రికార్డు స్థాయిలో కొండమల్లేపల్లి సంత వేలం పాట అత్యంత ఖరీదుగా జరిగిందని అన్నారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా సిఐ నవీన్‌కుమార్, ఎస్ఐ అజ్మీరా రమేష్‌లు పటిష్ట పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. ఈకార్యక్రమంలో తహశీల్దార్ నరేందర్, ఇంచార్జ్ ఎంపిడిఓ సుధీర్‌కుమార్, ఆర్ఐ శ్రీనివాస్, పంచాయతీ కార్యదర్శి డాకునాయక్, సర్పంచ్ పసునూరి యుగేందర్ రెడ్డి, ఉప సర్పంచ్ కొడిదాల పద్మ వెంకటయ్య, వార్డు సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

### ఆశా వర్కర్ల సమస్యలను పరిష్కరించాలి

**ప్రజాపక్షం/గుండాల;** ఆశ వర్కర్ల సమస్యలను పరిష్కరించాలని మండల కేంద్రంలో ఆశ వర్కర్లు నిరసన వ్యక్తం చేశారు. ఆశ వర్కర్ల మండల జేఏసి నాయకురాలు శోభ మాట్లాడుతూ ప్రతి నెల 1న జీతాలు చెల్లించే విధంగా చర్యలు తీసుకోవాలని, పెండింగ్‌లో ఉన్న జీతాలను తక్షణమే విడుదల చేయాలని, కనీస వేతనం రూ. 18వేలు ఇవ్వాలని, పిఎఫ్, ఈఎస్ఐ సౌకర్యం కల్పించాలని, ఏఎన్ఎం, జీఎన్ఎం పోస్టులలో అర్హులైన ఆశ వర్కర్లకు ప్రాధాన్యం ఇవ్వాలని, ప్రభుత్వం ఎన్నికల ముందు ఆశ వర్కర్లకు ఇచ్చిన హామీలను తక్షణమే నెరవేర్చాలని డిమాండ్ చేశారు.



## ఉచిత టీకాలను సద్వినియోగం

**ప్రజాపక్షం/పెన్‌పహాడ్ :** పాడి రైతులు ఉచిత గాలికుంటు వ్యాధి నివారణ టీకాలను సద్వినియోగం చేసుకోవాలని సర్పంచ్ మల్లెపాక సాయిబాబా అన్నారు. బుధవారం మండల కేంద్రంలో ప్రాంతీయ పశువైద్యాధికారి డాక్టర్ భయగాని రవి ప్రసాద్ గౌడ్‌తో గాలికుంటు వ్యాధి నివారణ టీకాల కార్యక్రమాన్ని ప్రారంభించి మాట్లాడారు. రైతులకు పంటలు ఎంత ముఖ్యమో పశువుల రక్షణకు అంతే ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. వ్యవసాయంతో పాటు పాడి పశువుల పెంపకం ద్వారా రైతులు అదనంగా ఆదాయం పొందుతున్నారన్నారు. 125 పశువులకు టీకాలు ఇవ్వడం జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల పశువైద్యాధికారి డాక్టర్ నరేష్, ఎల్ఎస్ఏ రాజశేఖర్, వెటర్నరీ అసిస్టెంట్ రవి, గోపాల మిత్రలు, గ్రామ రైతులు పాల్గొన్నారు.

## వ్యాలీడేషన్ చట్టాన్ని రద్దు చేయాలి




**ప్రజాపక్షం/సూర్యాపేట కలెక్టరేట్ :** కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన వ్యాలీడేషన్ చట్టాన్ని వెంటనే రద్దు చేయాలని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ రిటైర్డ్ ఉద్యోగుల సంఘం సూర్యాపేట జిల్లా ప్రధాన కార్యదర్శి దండ శ్యాంసుందర్ రెడ్డి డిమాండ్ చేశారు. బుధవారం కలెక్టరేట్ కార్యాలయం ఎదుట నిరసన చేపట్టి అనంతరం ఏఓ సుదర్శన్ రెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఈ చట్టం వలన తేది.01.01. 2026 ముందు రిటైర్డ్ అయిన పెన్షనర్స్‌కు ఎటువంటి ఆర్థిక ప్రయోజనములు ఉండవన్నారు. డిఏలు, పిఆర్‌సి లాంటివి ఉండవన్నారు. దొడ్డిదారిలో తీసుకవచ్చిన పెన్షన్ వ్యాలీడేషన్ చట్టమును రద్దు చేయాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో కొండేటి రవీందర్ రెడ్డి, ఎస్ఏ హమీద్ ఖాన్, కె రంగారెడ్డి, నిర్మల, నాగేశ్వర్‌రావు, యాదగిరి పాల్గొన్నారు.

## పునర్విభజనలో రామన్నపేట నియోజకవర్గంగా ఏర్పడాలి

**ప్రజాపక్షం/రామన్నపేట :** రామన్నపేటని పునర్విభజనలో భాగంగా నియోజకవర్గంగా ప్రకటించుటకు అన్ని అవకాశాలు ఉన్నందున, నియోజవర్గ సాధన కోసం రామన్నపేట నియోజకవర్గ సాధన సమితి ఆధ్వర్యంలో ఇకనుండి నియోజకవర్గ ఏర్పడేంతవరకు నిరంతర కార్యక్రమాలు ఉంటాయని రామన్నపేట నియోజకవర్గ సాధన సమితి వర్కింగ్ ప్రెసిడెంట్ ఎర్ర రమేష్ గౌడ్ అన్నారు. ఈ విలేకరుల సమావేశ ప్రకటనలో ఎర్ర రమేష్ గౌడ్ మాట్లాడుతూ రామన్నపేటకు నియోజకవర్గంగా ఉండటానికి అన్ని అవకాశాలు ఉన్నాయని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు గుర్తించాయని, అన్ని రకాల ఆఫీసులు ఉన్న, భౌగోళికంగా పాలించడానికి అన్ని వసతులు ఉన్న రామన్నపేటని పునర్విభజనలో భాగంగా నియోజకవర్గంగా ఏర్పాటు చేయించడానికి అన్ని పార్టీల నాయకులు కార్యకర్తలు తమ సొంత ఏజెండాగా ముందుకు రావాలన్నారు.

## ఇంధన కొరతతో ఇబ్బందులు

**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** ఇటీవల జరుగుతున్న పరిణామాల వల్ల పెట్రోల్ కొరత ఉందని ఉదంతం వల్ల ప్రజలు అనవసరంగా బంకుల వద్ద క్యూ కడుతూ ఇబ్బందులకు గురవుతున్నారని టీడీపీ పార్టీ నాయకులు పోగుల సైదులుగౌడ్ అన్నారు. బుధవారం ఆయన మాట్లాడుతూ ఆయా పెట్రోల్ బంక్‌ల వద్ద తగినంత నిల్వలు ఉన్నాయని సరఫరా గొలుసు ఎక్కడ ఆగడం లేదని యాజమాన్యాలు స్పష్టం చేసినప్పటికీ ముడి చమురు ఉత్పత్తులు లేకపోవడంతో ప్రజలు ఒక్కసారిగా కొనుగోలు చేయడానికి కోసం బంకులకు వెళ్తున్నారని అన్నారు. ప్రజల భయాలను నివృత్తి చేయడంలో అధికారులు కృషి చేయాలన్నారు. ప్రభుత్వం, అధికారులు వెంటనే స్పందించి ప్రజలను చైతన్యవంతులను చేయాలన్నారు.



## ఎస్ఐఆర్‌పై బిఎల్‌ఒలకు శిక్షణ

**ప్రజాపక్షం/గుండాల;** యాదాద్రి భువనగిరి జిల్లా గుండాల మండల కేంద్రంలోని స్థానిక జిల్లా పరిషత్ హై స్కూల్‌లో బుధవారం ఎస్ ఐ ఆర్ పై బిల్‌ఓలకు మాస్టర్ ట్రైనర్ జంపాల రాజు,నరేష్‌ల ఆధ్వర్యంలో శిక్షణ కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈసందర్భంగా మండల తహశీల్దార్ హరికృష్ణ బిఎల్‌ఓలకు ఎస్ఐఆర్ లో భాగంగా హౌస్ టూ హౌస్ సర్వే పై పలు సూచనలు సలహాలను అందజేశారు. ఈకార్యక్రమంలో డిప్యూటి తహశీల్దార్ నీలిమ, ఎలక్షన్ సూపర్ వైజర్లు ఆర్ఐ ప్రభుదాస్, సినియర్ అసిస్టెంట్ శ్రీనివాస్ రావు, జూనియర్ అసిస్టెంట్ కృష్ణ, మాధవి, వెంకన్న, బిఎల్‌ఓలు, సిబ్బంది పాల్గొన్నారు.

## గురుకుల ప్రవేశ పరీక్షలో విద్యార్థుల ప్రతిభ



**ప్రజాపక్షం/గుండాల;** మంగళవారం విడుదలైన ఐదవ తరగతి గురుకుల ప్రవేశ పరీక్ష ఫలితాల్లో గుండాల మండలం వంగాల ప్రాథమిక పాఠశాల విద్యార్థులు చిప్పలపల్లి మోక్షిత, చిప్పలపల్లి యక్షలు సీటు సాధించడంతో బుధవారం గ్రామ సర్పంచ్ చిప్పలపల్లి యాదమ్మ నర్సింహాలు అభినందిస్తూ విధ్యార్థులను సన్మానించారు. ఈకార్యక్రమంలో సిఆర్‌పి లింగయ్య, అమ్మ ఆదర్శ పాఠశాల చైర్మన్ జానీవేగం రవిశంకర్, ఉప సర్పంచ్ నాగరాజు, కార్యదర్శి అనిత, వార్డు సభ్యులు సోమనర్సయ్య, గ్రామ పెద్దలు నర్సింహా, సోమన్న, స్వామి, లింగమల్లు, గణేష్, రవి శంకర్, శ్రావణి, నిర్మల తదితరులు పాల్గొన్నారు.

## హిందువుల ఐక్యతే సనాతన ధర్మ రక్షణకు పునాది

**ప్రజాపక్షం/గుండాల;** యాదాద్రి భువనగిరి జిల్లా గుండాల మండలం రామారం గ్రామంలో బుధవారం ఆంజనేయ స్వామి ఆలయంలో హిందువుల ఐక్యతే సనాతన ధర్మ రక్షణకు పునాది అని గ్రామస్తులు ఆలయ పూజారి వెంకటరాఘువాచార్యుల ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈసందర్భంగా రాష్ట్ర రైతు సంక్షేమ సమితి గౌరవాధ్యక్షులు ఓర్స్ ఇంద్రసేన మాట్లాడుతూ ఐక్యత కోసం హిందువుల బతుకు భరోసా మూట అనే కార్యక్రమాన్ని ప్రారంభించామని అన్నారు. ఈ గ్రామంలో ప్రారంభమైన ఈకార్యక్రమాన్ని అంచెలంచెలుగా అన్ని గ్రామాలకు పాకి ప్రతి ఒక్కరు దైవ భక్తి అలవర్చుకునే విధంగా సనాతన ధర్మ సంరక్షణలో భాగంగా పాలు పంచుకోవాలని తెలిపారు. ఈకార్యక్రమంలో ఆంజనేయులు, పరమేశ్వరి సంగీత, యాదయ్య, సురేష్ తదితరులు పాల్గొన్నారు.



## మార్త్తో పోటీల్లో ఎంజియు బీటెక్ విద్యార్థుల ప్రాజెక్టు ఎంపిక



**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్:** హైదరాబాద్‌లో ఎడ్యునేట్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన మార్త్తో పోటీల్లో మహాత్మా గాంధీ యూనివర్సిటీ (ఎంజీయూ) బీటెక్ సిఎస్‌సి మూడవ సంవత్సరం విద్యార్థుల ప్రాజెక్టు ఎంపిక కావడం విశేషంగా నిలిచింది. ఈసందర్భంగా ఎంజీయూ ఉపకులపతి ఆచార్య ఖాజా అల్తాఫ్ హుస్సేన్ విద్యార్థులను అభినందించారు. పాజెక్టుల ద్వారా విద్యార్థుల్లో స్వీయ అభ్యాసం, జిజ్ఞాస పెంపొందుతాయని, నూతన ఆవిష్కరణలపై దృష్టి సారించాలని సూచించారు.మూడు దశల్లో నిర్వహించిన ఈ పోటీల్లో మొత్తం 560 టీములు పాల్గొనగా, తుది ఎంపికకు 29 టీములు మాత్రమే ఎంపికయ్యాయి. ఆ జాబితాలో ఎంజీయూ విద్యార్థుల ప్రాజెక్టు చోటు దక్కించుకోవడం విశేషమని ఆయన పేర్కొన్నారు. సెక్యూర్ గ్రాఫ్ క్రిప్టో సిస్టమ్: ఏడీఎస్‌ఏ డ్రివెన్ మల్టీ లేయర్ ఎన్‌క్రిప్షన్ ఫ్రేమ్‌వర్క్ అనే అంశంపై ఈ ప్రాజెక్టును డాక్టర్ ఎం. జయంతి పర్యవేక్షణలో విద్యార్థులు కొనడా సాంబ ప్రసాద్ రెడ్డి, బి.కార్తీక్, మాదిహ షాకూర్,సిహెచ్ మానస సమర్పించారు.

## కోతుల దాడి మహిళకు తీవ్ర గాయాలు



**ప్రజాపక్షం/నకిరేకల్ (కట్టంగూరు):** మండలంలోని చెర్వుఅన్నారం గ్రామంలో కోతుల దాడితో ఓ మహిళ తీవ్రంగా గాయపడిన ఘటన బుధవారం చోటుచేసుకుంది.స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం గ్రామానికి చెందిన సంతోష్ శాస్త్ర ఇటీవల నూతనంగా ఇల్లు నిర్మించుకొని రక్షణ కోసం ప్రహరీ గోడపై సోలార్ వైర్లు ఏర్పాటు చేశాడు.బుధవారం ఉదయం ఓకోతి పిల్ల సోలార్ తీగపైకి ఎక్కి జారి ఇంటి ప్రాంగణంలో పడింది.దీంతో బయట ఉన్న పెద్ద కోతులు ఆందోళనగా అరుస్తూ అక్కడికి చేరాయి.ఇదే సమయంలో ఆఇంట్లో పనులు చేస్తున్న కోనేటి ఎల్లమ్మ(60) (భర్త నరసింహ) ఆవరణ శుభ్రం చేస్తుండగా కోతులు ఒక్కసారిగా ఆమెపై దాడికి దిగాయి.భయంతో ఆమె కేకలు వేయడంతో మరికొన్ని కోతులు చేరుకుని విపరీతంగా కొరికి,గీసి దాడి చేశాయి.దాడిలో ఆమెకు,చేతులు,కాళ్లపై తీవ్ర గాయాలయ్యాయి.ఒంటినిండా గాయాలతో రక్త స్రావం కావడంతో ఘటనను చూసిన స్థానికులు భయాందోళనకు గురయ్యారు.వెంటనే స్పందించి కోతులను తరిమి,108 అంబులెన్స్‌కు సమాచారం అందించారు.గాయపడిన ఎల్లమ్మను ప్రభుత్వ ఆసుపత్రి నల్లగొండకు తరలించారు. ప్రస్తుతం ఆమెకు చికిత్స కొనసాగుతోంది.గ్రామంలో కోతుల బెడద రోజురోజుకూ పెరుగుతోందని,ఇండ్లపై స్వైర విహారం చేస్తూ ప్రజలను భయభ్రాంతులకు గురి చేస్తున్నాయని గ్రామస్తులు తెలిపారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా అటవీశాఖ అధికారులు తక్షణ చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. బాధిత కుటుంబాన్ని ఆదుకోవడంతో పాటు కోతుల నివారణకు ప్రత్యేక చర్యలు చేపట్టాలని గ్రామ ప్రజలు విజ్ఞప్తి చేశారు.

## విద్యార్థి వసతి గృహ నిధుల దుర్వినియోగం కేసు




### ఏడుగురు నిందితులకు జైలు శిక్ష - సంఘం నేతల స్పందన

**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్:** పట్టణంలోని నయీ బ్రాహ్మణ సేవా సంఘానికి చెందిన విద్యార్థి వసతి గృహ నిధుల దుర్వినియోగం కేసులో కోర్టు కీలక తీర్పు వెలువరించింది.ఈకేసులో నిందితులుగా ఉన్న ఏడుగురికి జైలు శిక్ష విధించడంతో పాటు జరిమానా కూడా విధించినట్లు సంఘం నాయకులు తెలిపారు.బుధవారం నల్లగొండలోని నయీబ్రాహ్మణ సేవా సంఘం జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సంఘం జిల్లా అధ్యక్షుడు నేలపట్ల రమేష్,కోశాధికారి నేలపట్ల సత్యనారాయణ మాట్లాడారు సంఘానికి చెందిన విద్యార్థి వసతి గృహ నిధులను కొంతమంది సభ్యులు దుర్వినియోగం చేసినట్లు వెల్లడించారు. సుమారు రూ.7.35లక్షలు ఏడుగురు సభ్యులు కలిసి అక్రమంగా వినియోగించుకున్నారని,దీనిపై కేసు నమోదు చేయబడినట్లు తెలిపారు.ఈకేసును విచారించిన నల్లగొండ ప్రిన్సిపల్ జ్యుడీషియల్ ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ కోర్టు నిందితులను దోషులుగా తేల్చింది.ఈ సందర్భంగా సికిలంబట్ల యాదగిరి,కంది మట్టపల్లి,కనుగుల అంజయ్య,నాంపల్లి శ్రీనివాస్, గజవెల్లి సత్యం,యెలుగుబెల్లి కృష్ణమూర్తి, ఈటికల శ్రీనివాస్ అనే ఏడుగురికి భారతీయ శిక్షాస్మృతి సెక్షన్ 420 కింద ఆరు నెలల సాధారణ కారాగార శిక్ష విధించడంతో పాటు జరిమానా విధించినట్లు తెలిపారు. న్యాయపరంగా చర్యలు తీసుకుని నిందితులను శిక్షించిన న్యాయస్థానానికి,కేసును సమర్థంగా దర్యాప్తు చేసిన పోలీసు అధికారులకు సంఘం తరఫున ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.ఈ సమావేశంలో సంఘం నాయకులు కంది సూర్యనారాయణ,నెలపట్ల రామయ్య,రఘునాథం,పగిడి పాల చంద్రయ్య, చింతకుంట్ల చంద్రం,దుగ్యాల లక్ష్మీనారాయణ,కంది గిరి పాల్గొన్నారు.

## అర్హులైన వ్యక్తులను ఓటరుగా నమోదు చేయాలి

**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** భారత రాజ్యాంగంలోని అధికరణలు 324, 325, 326 ప్రకారం, ఎన్నికల సంఘం నియమావళిని అనుసరించి ప్రత్యేక సమగ్ర సర్వే ఆధారంగా ప్రతి ఓటరు పూర్తి వివరాలను నమోదు చేయాలని తహసీల్దార్ పి.శ్రీనివాస్ అన్నారు. బుధవారం పట్టణలోని రైతువేదికలో బీఎల్‌వోలకు, బీఎల్‌వో సూపర్‌వైజర్లకు ఇచ్చిన శిక్షణ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడుతూ 1987కు ముందు ఓటరుగా నమోదు అయినటువంటి వ్యక్తులకు ఎటువంటి డాక్యుమెంట్స్ అవసరం లేదని 1987 నుంచి 2004 మధ్యలో ఓటర్‌గా నమోదు కావాలన్నప్పుడు తల్లి లేదా తండ్రి ఏదేని ఆధార పత్రాన్ని జతపరచాలని 2004 తరువాత ఓటరుగా నమోదు అయిన వారు తల్లి, తండ్రి ఆధార పత్రాలను జత చేయాలని అన్నారు. కార్యక్రమంలో ఎన్నికల డీటీ ప్రవీణ్‌కుమార్, ట్రైనర్లు గుడిపాటి కోటయ్య, అంబటి శ్రీను, సిబ్బంది రామకృష్ణ, పవన్, సూపర్‌వైజర్లు, బీఎల్‌వోలు పాల్గొన్నారు.

## ఏప్రిల్ 2 వరకు ఎస్‌సి యువత సబ్సిడీ లోన్‌లకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు

**ప్రజాపక్షం/చండూరుః** ఎస్సీ యువత ప్రభుత్వం అందిస్తున్న సబ్సిడి లోన్‌లకు దరఖాస్తు చేసుకోవాలని ఎంపిడివో బండారు యాదగిరి బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. 2026/27కు సంబంధించి ఎస్సీ కార్పోరేషన్ ద్వారా ఎలక్ట్రికల్ కు చెందిన ద్విచక్ర వాహనాలు , మూడు చక్రాల వాహనాలు , సోలాల్ యునివర్సల్ పంపు సెట్లు , వ్యవసాయ సంబందించిన పరికరాలుకు 60శాతం నుండి 90 శాతం వరకు ప్రభుత్వ సబ్సిడి వస్తుందని తెలిపారు. మండలంలో ఆసక్తి ఉన్న ఎస్సీ యువత ఏప్రిల్ 2వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తూ చేసుకోవాలని తెలిపారు. దరఖాస్తుకు జత పర్చవలసిన ధృవపత్రాలు దరఖాస్తు దారుడి ఆధార్ కార్డు .రేషన్ కార్డు ,కుల దృవీకరణ పత్రం, ఆదాయ ధృవీకరణ పత్రం,డ్రైవింగ్ లైసెన్స్ సమర్పించవలసి ఉంటుందని తెలిపారు. సోలార్ పంపు సెట్లు కావలసిన రైతులకు మినిమం 2 ఎకరాల వ్యవసాయ భూమి కలిగి ఉండాలని తెలిపారు.

## ఎన్‌జి కళాశాల పాత విద్యార్థులకు మరో అవకాశం

**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్ :** పట్టణంలోని నాగార్జున ప్రభుత్వ కళాశాలలో 201112 నుండి 2022/23 విద్యా సంవత్సరాల్లో చేరిన విద్యార్థులు డిగ్రీ మూడు సంవత్సరాలు పూర్తి చేసి ఫయిల్ అయిన విద్యార్థులకు బ్యాక్లాగ్ పరీక్షలు జూన్ జులైలో పరీక్షలు నిర్వహించబడతాయని ప్రిన్సిపాల్ ప్రొఫసర్ సముద్రాల ఉపేందర్ పరీక్షల నియంత్రాణాధికారి డాక్టర్ డి. మునిస్వామి తెలిపారు.బ్యాక్ లాగ్ పరీక్షలు వ్రాసే విద్యార్థులు కళాశాలలోని కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్ ఆఫీస్ లో పరీక్ష దరఖాస్తు ఫారం తీసుకుని ఆన్లైన్ ద్వారా ఫీజు చెల్లించి పరీక్ష దరఖాస్తు ఫారంతో పాటు ఆన్లైన్లో కట్టిన ఫీజు రసీదుతో బ్యాక్ లాగ్ పరీక్షలకు దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. పరీక్ష ఫీజు ఈనెల 25 నుండి 15 వరకు ఎప్పుడైనా చెల్లించవచ్చని అన్నారు.ఇతర వివరాలకు కళాశాలలోని నోటీస్ బోర్డు చూడాలని తెలిపారు.

## 27నశ్రీ కోదండ రామచంద్రస్వామి ఆలయంలో సీతారాముల కల్యాణ మహోత్సవం

**ప్రజాపక్షం/త్రిపురారం:** శ్రీరామనవమి పర్వదినాన్ని పురస్కరించుకొని త్రిపురారం మండల కేంద్రంలోని శ్రీ కోదండ రామచంద్ర స్వామి ఆలయంలో శుక్రవారం శ్రీ సీతారాముల కళ్యాణ మహోత్సవాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ చైర్మన్ అనుముల శ్రీనివాస్ రెడ్డి తెలిపారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఈ పవిత్ర వేడుకకు మండల పరిసర ప్రాంతాల నుండి అధిక సంఖ్యలో భక్తులు హాజరై, కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. భక్తుల కోసం అన్ని ఏర్పాట్లు పూర్తిచేసినట్లు తెలిపారు. శ్రీ సీతారాముల కళ్యాణం సందర్భంగా ఆలయం వద్ద ప్రత్యేక పూజలు, హోమాలు, భజనలు నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ పేర్కొంది. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని స్వామి వారి ఆశీర్వాదాలు పొందాలని కోరారు.

## ప్రభుత్వ పాఠశాలలోనే నాణ్యమైన విద్య

**ప్రజాపక్షం/నకిరేకల్ :** ప్రభుత్వ పాఠశాలలోనే నాణ్యమైన విద్య అందుతుందని తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని నకిరేకల్ ఎంఈఓ మేక నాగయ్య సూచించారు.బుధవారం ప్రాథమికోన్నత పాఠశాల చందంపల్లి ఆధ్వర్యంలో 2026 27 విద్యా సంవత్సరానికి ముందస్తు ప్రవేశాల బడిబాట ర్యాలీని గ్రామ సర్పంచ్ మాచర్ల చంద్రకళ యాదగిరితో కలిసి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు కనుకుంట్ల నవీన్ రెడ్డి, ఏఏపీసీ చైర్మన్ గాధగోని సృజన, వార్డు సభ్యులు కలిమెర వెంకటస్వామి, ఆకారపు శైలజ, ఉపాధ్యాయులు వేదాంతం ఆదిత్య,భూపతి అనిత,వెల్మకంటి శ్రీహరి పాల్గొన్నారు.





## అంబేద్కర్ జయంతిని ఘనంగా నిర్వహించాలి

**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్:** ఏప్రిల్ 14న మహానేత డాక్టర్ బిఆర్ అంబేద్కర్ జయంతి ని పార్టీ శ్రేణులు ఘనంగా నిర్వహించాలని బహుజన్ సమాజ్ పార్టీసెంట్రల్ స్టేట్ కోఆర్డినేటర్ చంద్రశేఖర్ ముదిరాజ్ పిలుపునిచ్చారు.బుధవారం పట్టణంలోని అంబేద్కర్ భవన్‌లో ఏర్పాటుచేసిన సమావేశంలో పోస్టర్‌ను ఆవిష్కరించి మాట్లాడుతూ బహుజన సమాజ్ పార్టీ ఆలోచనలు గ్రామ స్థాయికి తీసుకెళ్లి పార్టీ బలోపేతానికి అందరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలోరాష్ట్ర జనరల్ సెక్రటరీ,పార్లమెంట్ చీఫ్ జోన్ ఇంచార్జి ప్రభు కుమార్,జనరల్ సెక్రటరీ ఉమ్మడి జిల్లా ఇంచార్జి శ్రీకాంత్ మంచాల,నల్లగొండ పార్లమెంటు ఇంచార్జి వంటెపాక యాదగిరి,జిల్లా వైస్ ప్రెసిడెంట్ భాషపాక శివ,కత్తుల కాన్షీరామ్ ,బొడ్డు కిరన్,రావులపాటి రవిశంకర్ తదితరులు పాల్గొన్నారు.

## మహిళలు ఐక్యంగా ఉద్యమించాలి

**ప్రజాపక్షం/నకిరేకల్** : మహిళలు తమ హక్కుల కోసం ఐక్యంగా ఉద్యమించాలని ఐద్వా జిల్లా ఉపాధ్యక్షురాలు చెన్నబోయిన నాగమణి కోరారు. బుధవారం నకిరేకల్ పట్టణంలోని శివాజీ నగర్ 12వ వార్డులో ఐద్వా ఆధ్వర్యంలో సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు.మహిళలపై రోజురోజుకు అత్యాచారాలు,హత్యలు పెరుగుతున్న ప్రభుత్వాలు పట్టించుకోవడం లేదన్నారు. ఈకార్యక్రమంలో ఆసంఘం జిల్లా కమిటీ సభ్యురాలు బహు రోజు ఇందిరా,పట్టణ అధ్యక్షురాలు పన్నాల శశికళ,స్థానిక మహిళలు పాల్గొన్నారు.

## రోడ్డు భద్రతపై అవగాహన



**ప్రజాపక్షం/డిండి;** రోడ్డు భద్రతపై ప్రజలు అవగాహన కలిగి ఉండాలని రోడ్డు భద్రత నియమాలు ప్రతి ఒక్కరు పాటించాలని డిండి ఎస్ఐ సి.హెచ్. బాలకృష్ణ వాహనదారులకు బుధవారం అవగాహన కల్పించారు. మండల కేంద్రంలోని ఆర్టీసి బస్టాండ్‌లో ప్రజలకు, ప్రయాణికులకు రోడ్డు భద్రత సడక్ సురక్ష జీవన్ రక్షా, రోడ్డు భద్రత ప్రాణ రక్షణ విషయాలపై అవగాహన కల్పించారు. ద్విచక్ర వాహనదారులు విధిగా హెల్మెట్ ధరించాలని, మద్యం సేవించి వాహనాలను నడపరాదని సూచించారు. ఈకార్యక్రమంలో ప్రయాణికులు, వాహనదారులు, స్థానిక పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## సిసి రోడ్ల ప్రారంభం

**ప్రజాపక్షం/సంస్థాన్ నారాయణపురం** : మండలంలోని కొత్తగూడెం గ్రామంలో ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి సహకారంతో, ఎన్ఆర్ఈజీఎస్ నిధులతో మంజూరైన 20 లక్షలు వ్యయంతో సిసి రోడ్డును స్థానిక సర్పంచ్ చెరుకుపల్లి బీరయ్య ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు బాలగోని మల్లేష్, నీళ్ల అరుణ, రొమ్ముల సత్యం, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

## 30న తై బజార్ వేలం పాట

**ప్రజాపక్షం/డిండి:** ఈనెల 30న ఉదయం 11 గంటలకు డిండి గ్రామ పంచాయతీ కార్యాలయంలో డిండి సంత తై బజార్ వేలం పాట నిర్వహించడం జరుగుతుందని ఈ వేలం పాటలో ఆసక్తి గలవారు పాల్గొనాలని గ్రామ పంచాయతీ కార్యదర్శి గోరటి జంగయ్య బుధవారం తెలిపారు.

## బార్ అసోసియేషన్ అధ్యక్షుడిగా ఉమామహేశ్వర్ ఏకగ్రీవ ఎన్నిక



**ప్రజాపక్షం/దేవరకొండ:** దేవరకొండ బార్ అసోసియేషన్ అధ్యక్షులుగా సన్నాయిల ఉమా మహేశ్వర్ ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ఎన్నికల అధికారి రియాజుద్దీన్ బుధవారం తెలిపారు. గత మూడు సంవత్సరాలుగా దేవరకొండ బార్ అసోసియేషన్ అధ్యక్షులుగా కొనసాగుతూ కక్షిదారులకు న్యాయ సంబంధమైన కేసులను వాధిస్తూ ప్రజల్లో మంచి గుర్తింపు పొందిన ఆయన ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు అసోసియేషన్ సభ్యులు తెలిపారు. అనంతరం నూతన కమిటిని ఎన్నుకోవడం జరిగింది. అధ్యక్షులుగా ఉమా మహేశ్వర్, ప్రధాన కార్యదర్శిగా వనం జగదీశ్వర్, కోశాధికారిగా రవికుమార్, ఉపాధ్యక్షులుగా దుర్గా, శ్రీనివాస్, సహాయ కార్యదర్శులుగా పుష్పలత, యాదయ్య, కల్చరల్ కార్యదర్శిగా శంకర్ ఇతర సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగింది. ఎన్నికైన సభ్యులను సీనియర్ న్యాయవాదులు గాజుల ఆంజనేయులు, రోహిత్‌రెడ్డి, ముస్తాక్ అహ్మద్, ఎలక్షన్ అధికారి రియాజుద్దీన్ తదితరులు నూతన కమిటికి శుభాకాంక్షలు తెలిపారు.

## వైభవంగా దేవాలయ శంకుస్థాపన



**ప్రజాపక్షం/పెన్‌పహాడ్** : మండలంలోని మేఘ్యతండ గ్రామ పంచాయితీ పరిధిలోని గంగ్లీతండలో బుధవారం శ్రీప్రసన్నాంజనేయ స్వామి దేవాలయ నిర్మాణానికి అత్యంత వైభవంగా శంకుస్థాపన కార్యక్రమం సర్పంచ్ భూక్యా రాజు ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ టూరిజం డెవలప్‌మెంట్ కార్పోరేషన్ చైర్మన్ పటేల్ రమేష్ రెడ్డి, ఏఐసిసి సభ్యులు రాంరెడ్డి సర్వోత్తమ్ రెడ్డి, వ్యవసాయ మార్కెట్ కమిటి చైర్మన్ కొప్పుల వేణారెడ్డి, మాజీ చైర్మన్ తూముల భుజంగరావు, మండల అధ్యక్షులు తూముల సురేష్‌రావులు ముఖ్య అతిధులుగా హజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం వారు మాట్లాడుతూ గత ఎన్నికల్లో ఇచ్చిన వాగ్దానం మేరకు మేఘ్యతండ నుండి గంగ్లీ తండ వరకు ప్రజలు రవాణా కష్టాలను తీర్చేందుకు రూ.1కోటి 90లక్షలతో బీటీ రోడ్డు నిర్మాణానికి టెండర్ ప్రక్రియ పూర్తియందన్నారు. అతిత్వరలోనే పనులు ప్రారంభమవుతాయన్నారు. దురాజుపల్లి నుండి గరిడేపల్లి వరకు ఫోర్ లైన్ రహదారి నిర్మాణం చేపట్టేందుకు ఇప్పటికే ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపినట్లు వివరించారు. ఈ సందర్భంగా పటేల్ రమేష్ రెడ్డి రూ.50వేలను విరాళాన్ని ప్రకటించారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ మాలోతు వరలక్ష్మి వెంకన్న, ధర్మాపురం సర్పంచ్ దొంగరి దివ్య లింగస్వామి, సుజాత, గుండు వెంకన్న, సాగర్, నాగు, శంకర్ పాల్గొన్నారు.

## ముగిసిన బయోసైన్స్ జాతీయ సదస్సు



**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్:** మహాత్మా గాంధీ విశ్వవిద్యాలయం బయోటెక్నాలజీ, బయోకెమిస్ట్రీ, బోటనీ విభాగాల ఆధ్వర్యంలో నిర్వహించిన రెండు రోజుల బయోసైన్స్ జాతీయ సదస్సు బుధవారం విజయవంతంగా ముగిసింది.ముగింపు సమావేశానికి ముఖ్య అతిథిగా విశ్వవిద్యాలయ రిజిస్ట్రార్ ఆచార్య కొప్పుల అంజిరెడ్డి హాజరై ప్రసంగించారు.ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ జీవ ఆధారిత ఆర్థిక వ్యవస్థల ద్వారా మాత్రమే ప్రపంచ ప్రగతి సాధ్యమవుతుందని, ఆరోగ్యకరమైన భూతలం నిర్మాణానికి బయోసైన్స్ కీలకమని పేర్కొన్నారు.సదస్సు రెండోరోజు పలు ముఖ్య అంశాలపై నిపుణులు తమ పరిశోధనలను ప్రదర్శించారు. నానో ఎంజైమ్ ఆధారిత పదార్థాల ద్వారా మల్టీ డ్రగ్ రెసిస్టెంట్ బ్యాక్టీరియా నియంత్రణపై డా. సంజయ్ సింగ్ వివరణ ఇచ్చారు. ప్రోబయోటిక్ బ్యాక్టీరియా వినియోగంతో మానవ ఆరోగ్యాన్ని మెరుగుపరచి దీర్ఘకాలిక వ్యాధుల నుండి రక్షణ పొందవచ్చని డా. ఆచార్య భీమ వివరించారు.వ్యవసాయ రంగంలో జీవ ఖనిజాల ప్రాముఖ్యత, అధిక దిగుబడుల సాధనపై హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీకి చెందిన ఆచార్య రాహుల్ కుమార్ ప్రసంగించారు.ఈ కార్యక్రమంలో డాక్టర్ సోమేశ్వర్,అరుణశ్రీ,డాక్టర్ కె. ప్రేమ్‌సాగర్,ప్రిన్సిపల్ ఆచార్య వసంత, డాక్టర్ తిరుమల,డాక్టర్ మాధురి,డాక్టర్ రామచంద్ర గౌడ్ తదితర అధ్యాపకులు పాల్గొన్నారు.

## కౌన్సిలర్లు ఎన్నికై 45 రోజులు గడిచిన మున్సిపల్ సమావేశాలు ఇంకెప్పుడు?



**ప్రజాపక్షం/భువనగిరి** : కొత్తగా మున్సిపల్ కౌన్సిలర్‌లు ఎన్నికై 45 రోజులు గడిచినా ఇప్పటి వరకు మున్సిపల్ సమావేశాలు ఏర్పాటు చేయకపోవడం దారుణమాని బిఆర్ఎస్ పట్టణ పార్టీ అధ్యక్షులు ఏవి.కిరణ్ కుమార్ అన్నారు. బుధవారం యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టర్ కార్యాలయంలో బిఆర్ఎస్ పట్టణ పార్టీ ఆధ్వర్యంలో బిఆర్ఎస్ పార్టీ కౌన్సిలర్‌లు కలిసి కార్యాలయ ఏఓ అంజిరెడ్డికి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నూతనంగా ఎన్నికైన కౌన్సిలర్లు ఆయా వార్డుల సమస్యలు కౌన్సిల్‌కు తెలియజేసి వాటి పరిష్కారానికి మార్గం చూడవలసి ఉన్నందన్నారు. ఇప్పటికైన వెంటనే సమావేశం ఏర్పాటు చేయాలని కోరారు. భువనగిరి పట్టణంలో ఉన్నటువంటి మహిళ స్వయం సహాయక సంఘాలకు సంబంధించిన మహిళల సాధికారత కోసం స్వయం సహాయక సంఘాలకు బ్యాంకుల ద్వారా అందుతున్న రుణాలను కొంతమంది బ్యాంకు ఉద్యోగులు, మెప్మా అధికారులు, ఆర్పీలు దుర్వినియోగం చేసిన దానిపై సమగ్ర విచారణ జరిపి బాధితులకు న్యాయం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ పట్టణ అధ్యక్ష కార్యదర్శులు ఏవి కిరణ్ కుమార్, రచ్చ శ్రీనివాస్ రెడ్డి, నాయకులు మరియు కౌన్సిలర్‌లు చెన్న స్వాతి మహేష్, నాకోటి నగేష్, చీమల రాజు, ఏలే భువనేశ్వరి శివ, తాడూరు బిక్షపతి, తాడెం రాజశేఖర్, నువ్వుల సుధాకర్, సుభాష్, సైదులు, మధు తదితరులు పాల్గొన్నారు.

## శ్రీరాముడు చూపిన బాటలో నడవాలి

**ప్రజాపక్షం/సూర్యాపేట టౌన్** : శ్రీరాముడు తండ్రి మాటను జవదాటకుండా 12 ఏండ్లు అరణ్యవాసం చేశాడని ఆయన చూపిన బాటలో ప్రతి ఒక్కరు తండ్రి మాట జవదాటవద్దని శ్రీసంతోషిమాత దేవాలయం అర్చకులు బట్టారం వంశీకృష్ణ శర్మ తెలిపారు. బుధవారం శ్రీసంతోషిమాత ఆలయంలో శ్రీసీతారామచంద్ర స్వామి నవరాత్రోత్సవాల సందర్భంగా ఉగాది నుండి శ్రీరామనవమి వరకు ఏర్పాటు చేసిన శ్రీరామ భజన, శ్రీసామూహిక లలితా సహస్రనామ పారాయణం కార్యక్రమంలో భాగంగా బుధవారం ఆయన మాట్లాడారు. భిన్నత్వంలో ఏకత్వం లాగా శ్రీరాముడు భారతదేశంలో జన్మించి ప్రజా రంజక పాలన అందించారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో దేవాలయ ఉపాధ్యక్షులు బెలిదె అశోక్, తాళ్లపల్లి రామయ్య, తల్లాడ కృష్ణమూర్తి, దేవాలయ మేనేజర్ బచ్చు పురుషోత్తం, కక్కిరేణి పద్మ, కర్నాటి సూర్యకళ, సామ సుశీల, కొల్లూరు రత్నమాల, తాళ్ళపల్లి సుగంధమాల తదితరులు పాల్గొన్నారు.

## మెరుగైన వైద్యం అందించాలి



**ప్రజాపక్షం/మునగాల** : మండలంలోని నర్సింహులగూడెం గ్రామంలో సర్పంచ్ కుంచం ఇందిర నర్సయ్య సహకారంతో వినూత్న సూపర్ స్పెషాలిటి ఆసుపత్రి వారి సౌజన్యంతో ఉచిత మెగా వైద్య శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో ఉన్న పేద ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని సూచించారు. అనంతరం గ్రామంలో సుమారు రూ.500 మంది ప్రజలు వైద్య సేవలు వినియోగించుకున్నారు. వైద్యులు వరప్రసాద్, రిజ్వాన్, ఉదయ్ ప్రవళిక, మేనేజ్మెంట్ నల్లగట్టు నగేష్, ఉపసర్పంచ్ సీతారాములు, మాజీ ఎంపిటిసి విజయలక్ష్మి , మాజీ సర్పంచ్ సూర్యనారాయణ పాల్గొన్నారు.

## గిరిజన నాయకుల ముందస్తు అరెస్టు



**ప్రజాపక్షం/తుర్కపల్లి** : రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన బడ్జెట్ కేటాయింపుల్లో గిరిజనులను తీవ్ర అన్యాయం జరిగిందని, కాంగ్రెస్ పార్టీ ఎలక్షన్ మేని పోస్టులో ఎస్టీ డిక్లరేషన్‌ను అమలు చేయాలని, సంత్ శ్రీ సేవాలాల్ మహారాజ్ విగ్రహం, మందిరము రాష్ట్ర రాజధాని హైదరాబాద్ పరిసర ప్రాంతాల్లో 20 ఎకరాల స్థలాన్ని కేటాయించి నిర్మించలని డిమాండ్ చేస్తూ అసెంబ్లీ ముట్టడికి వెళ్లే గిరిజన నాయకులను తుర్కపల్లి పోలీసులు ముంద స్తుగా అరెస్ట్ చేశారు. వీరిలో లంబాడా హక్కుల పోరాటసమితి జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ ధీరావత్ రమేష్ నాయక్, జిల్లా ఉపాధ్యక్షులు గూగులోత్ నరేందర్ నాయక్, మండల అధ్యక్షులూ మాలోత్ రమేష్ నాయక్, ప్రధాన కార్యదర్శి చిన్నా నాయక్, వర్కింగ్ ప్రెసిడెంట్ బానోతు తిరుపతి నాయక్, భూక్యా శ్రీకాంత్ నాయక్, కృష్ణ నాయక్‌లు ఉన్నారు.

## మెగా వైద్య ఆరోగ్య శిబిరం

**ప్రజాపక్షం/తుర్కపల్లి** : తుర్కపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో డాక్టర్ రుచిరా రెడ్డి ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించిన మెగా వైద్య ఆరోగ్య శిబిరాన్ని గ్రామ సర్పంచ్ సోమల్ల వెంకటేష్ ప్రారంబించారు. ఈ వైద్య శిబిరానికి డాక్టర్ యశోద హాజరయ్యారు. ఈ క్యాంపులో ప్రత్యేక వైద్య నిపుణులు, వైద్యులచేత ప్రజలకు వివిధ అనారోగ్య సమస్యలు, జనరల్ మెడిసిన్, స్త్రీలు, ఎముకల, కంటి సమస్యలు, పిల్లల, డెంటల్ సర్జన్‌ల చేత తుర్కపల్లి మండల పరిధిలోని మొత్తం 125 మంది అనారోగ్య వ్యక్తులకు పరీక్షలు చేసి చికిత్స ఇవ్వడం జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో వి.రాజయ్య, బిస్మిల్లా, దయామని, జానీ పాషా, కె.సునీల్ కుమార్, కరింబీ, సుహాసిని, సిద్దేశ్వర్, గ్రామపంచాయతీ సెక్రటరీ శిరీష, అంజలి, ఉమారాణి, ఆశా కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.





## పెన్షన్ వాలిడేషన్ చట్టం 2025ను ఉపసంహరించుకోవాలి

**ప్రజాపక్షం/చందూరు:** పెన్షన్ వాలిడేషన్ చట్టం 2025ను వెంటనే ఉపసంహరించుకోవాలని కోరుతూ మండల విశ్రాంత ఉద్యోగుల సంఘం మండల అధ్యక్షుడు గోనె సత్యనారాయణ రావు ఆధ్వర్యంలో బుధవారం తహసీల్దార్ రమాకాంత్ శర్మను కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో విశ్రాంత ఉద్యోగులు గాలెంక జీవరత్నం , రాజలింగం , మహబూబ్, పోల జగతయ్య తదితరులు పాల్గొన్నారు.

## గురుకుల ఫలితాల్లో సత్తా చాటిన ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు



**ప్రజాపక్షం/డిండి;** రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన 5వ తరగతి గురుకుల ప్రవేశ పరీక్ష ఫలితాల్లో గుండ్లపల్లి మండలంలోని 17 మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలకు చెందిన 72 మంది విద్యార్థులు ఎంపికై సత్తాచాటారు. ఈ సందర్భంగా ఎంపికైన విద్యార్థులకు, వారిని పరీక్షలకు సన్నద్ధం చేసిన ఉపాధ్యాయులకు మండల విద్యాశాఖ పక్షాన ఎంఈఓ పగిడిపాటి నర్సింహా బుధవారం అభినందనలు తెలిపారు. ఎంపికైన విద్యార్థులు బాగా చదువుకొని ఉన్నత స్థానాల్లో స్థిరపడాలని ఆశాభావం వ్యక్తం చేశారు.

## బాలల పరిరక్షణ బాధ్యత



**ప్రజాపక్షం/పెన్‌పహాడ్ :** బాలల పరిరక్షణ ప్రతి ఒక్కరు బాధ్యతని బాలల పరిరక్షణ విభాగం లీగల్ ఆఫీసర్ బి. నాగరాజు, సోషల్ వర్కర్ వి. శ్రీలక్ష్మి అన్నారు. బుధవారం మండలంలోని చీదెళ్ల గ్రామంలో ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమంలో భాగంగా జిల్లా బాలల పరిరక్షణ విభాగం, మహిళా శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో మిషన్ వాత్సల్య పథకం, బాలల చట్టాలపై గ్రామ సర్పంచ్ వరికల్లు పద్మ శ్రీనివాస్ అధ్యక్షతన అవగాహన కల్పించి వివిధ శాఖలతో గ్రామస్థాయి బాలల పరిరక్షణ కమిటిని ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ ఉపసర్పంచ్ దేవరం ప్రభాకర్ రెడ్డి, ఐసిడిఎస్ సూపర్‌వైజర్ ఎస్‌కె హనీఫా, చైల్డ్ లైన్ కేస్ వర్కర్ కిరణ్, ప్రధానోపాధ్యాయులు వెంకన్న, సావిత్రి, ప్రియాంక పాల్గొన్నారు

### తెలంగాణ పబ్లిక్ స్కూల్‌ను ఏర్పాటు చేయాలి

**ప్రజాపక్షం/చందూరు:** తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన తెలంగాణ పబ్లిక్ స్కూల్ ను రెవిన్యూ డివిజన్ కేంద్రమైన చండూరులో ఏర్పాటు చేయాలని బీసీ విద్యార్థి సంఘం నల్లగొండ జిల్లా అధ్యక్షుడు నల్ల మధు యాదవ్ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. మునుగోడు నియోజకవర్గంలో ఉన్న అన్ని మండలాలలో మోడల్ స్కూల్ ,గురుకుల పాఠశాలలు ఉన్నాయి కాని చండూరు మండలంలో అన్ని వసతులతో కూడిన ప్రభుత్వ పాఠశాల మాత్రం లేదని అన్నారు. చండూరులో ఏర్పాటు చేయని పక్షంలో బీసీ విద్యార్థి సంఘాల పక్షాన రాజగోపాల్‌రెడ్డి క్యాంప్ ఆఫీస్‌ను వేలాది మంది విద్యార్థులతో ముట్టడిస్తామని అన్నారు.

## నాణ్యమైన వస్త్రాలు అందించాలి: కంచర్ల



**ప్రజాపక్షం/నలగొండ టౌన్ :** కష్టమర్లకు నాణ్యత గల వస్త్రలు అందించి వారి మన్ననలను పొందాలని నల్లగొండ మాజీ శాసనసభ్యులు కంచర్ల భూపాల్ రెడ్డి సూచించారు.పట్టణంలోని బిఎస్ఎన్ఎల్ ఆఫీస్ ఎస్‌పిటి మార్కెట్ ఎదురుగా నూతనంగా ఏర్పాటు చేసిన ప్లే బాయ్ షాప్ ను బుధవారం మాజీ శాసనసభ్యులు కంచర్ల భూపాల్ రెడ్డి ప్రారంభించి మాట్లాడుతూ పట్టణ గ్రామీణ ప్రజలకు తక్కువ ధరతో నాణ్యమైన వస్త్రలను అందించాలన్నారు. అదే విధంగా యువతీ యువకులు వ్యాపార రంగాలలో రాణించాలని కోరారు. షాప్ ఏర్పాటుచేసిన మురళిని అభినందించారు.షాప్ నిర్వాహకులు గాలి మురళి మాట్లాడుతూ తమ షాపులో నూతన ఫ్యాషన్‌తో కూడిన వస్త్రలు అతి తక్కువ ధరలకు అందుబాటులో ఉన్నాయని పట్టణ గ్రామీణ ప్రజలు ఈ అవకాశం సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. ఈకార్యక్రమంలో మాజీ కౌన్సిలర్లు అభిమన్యు శ్రీనివాస్,పేర్ల అశోక్,బిఆర్ఎస్ పట్టణ అధ్యక్షులు బోనగిరి దేవేందర్,దండంపల్లి సత్తయ్య,మేడి ప్రమోద్, బిల్లా కత్తుల చందన్ పాల్గొన్నారు.

## లోక్ అదాలత్ ను వినియోగించుకోండి

**ప్రజాపక్షం/నకిరేకల్(శాలిగౌరారం):** కొట్టుకుంటే ఒక్కరే గెలుస్తారని,రాజీ పడితే ఇద్దరూ గెలిచినట్లేనని కాబట్టి రాజీవ్ మార్గమే రాజమార్గమని,లోక్ అదాలత్ ద్వారా సమన్యాయం సత్వర పరిష్కారం జరుగుతుందని శాలిగౌరారం ఎస్ఐ డిసైదులు అన్నారు.బుధవారం స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఎస్ఐ పేర్కొంటూ ఈనెల 28న జిల్లాలోని అన్ని కోర్టుల నందు నిర్వహించే జాతీయ లోక్ అదాలత్‌ను కక్షిదారులు సద్విని చేసుకోవాలని కోరారు.రాజీ పడదగిన కేసులో క్రిమినల్ సివిల్ తగాదా కేసులు,ఆస్తి విభజన కేసులు,కుటుంబ పరమైన నిర్వహణ కేసులు,వైవాహిక జీవితానికి సంబంధించిన కేసులు,బ్యాంక్ రికవరీ చెక్ బౌన్స్ కేసులో కక్షిదారులు రాజీ పడాలని సూచించారు.చిన్నచిన్న కేసులతో కక్షలు పెంచుకుని కోర్టుల చుట్టూ తిరుగుతూ సమయాన్ని డబ్బులను వృధా చేసుకోవద్దని జ్యుడీషియల్ డిపార్ట్మెంట్ ఇచ్చిన అవకాశాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

## ఉమ్మడి నల్లగొండ జిల్లా సర్పంచుల సంఘం అధ్యక్షుడిగా నర్సింహ



**ప్రజాపక్షం/మర్రిగూడ :** తెలంగాణ సర్పంచుల సంఘం ఉమ్మడి నల్లగొండ జిల్లా అధ్యక్షుడిగా మర్రిగూడ మండలం రాంరెడ్డిపల్లి గ్రామానికి చెందిన సర్పంచ్ లపంగి నర్సింహ నియమితులయ్యారు. హైదరాబాద్‌లో ప్రముఖ నాయకులు డాక్టర్ పిడమర్తి రవి ఆధ్వర్యంలో ఈనియామకం జరిగినట్లు వెల్లడించారు.ఈసందర్భంగా నర్సింహ మాట్లాడుతూ తనపై నమ్మకం ఉంచి ఈ బాధ్యతను అప్పగించిన నాయకత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. ఉమ్మడి నల్లగొండ జిల్లా వ్యాప్తంగా ఉన్న సర్పంచులను ఏకం చేసి,వారి హక్కుల సాధన కోసం పోరాడతానని పేర్కొన్నారు. గ్రామాల అభివృద్ధి, స్థానిక సంస్థల బలోపేతానికి కృషి చేస్తానని తెలిపారు.ఈ నియామకంపై రాంరెడ్డిపల్లి గ్రామ ప్రజలు,స్థానిక ప్రజాప్రతినిధులు హర్షం వ్యక్తం చేశారు.పలువురు సర్పంచులు ,నాయకులు శుభాకాంక్షలు తెలియజేశారు.

## నాణ్యతలేని సిసిరోడ్ల నిర్మాణం - కొద్ది రోజుల్లోనే పగుళ్లు,గుంతలు

### ప్రజాధనం వృథా అవుతోందని ఆందోళన- జాన్ తండాలో గ్రామస్థుల ఆగ్రహం

**ప్రజాపక్షం/నాంపల్లి:** మండలంలోని జాన్ తండ గ్రామంలో చేపట్టిన సీసీ రోడ్ల నిర్మాణ పనులపై తీవ్ర విమర్శలు వ్యక్తమవుతున్నాయి. నాణ్యతా ప్రమాణాలు పాటించకపోవడం వల్ల కొద్ది రోజుల్లోనే రోడ్లు పగుళ్లు పడుతూ, గుంతలు ఏర్పడుతున్నాయని గ్రామస్థులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.ఈ విషయంపై జాన్ తండా ఉప సర్పంచ్ సభావత్ ఉషారాణి మాట్లాడుతూ కాంట్రాక్టర్ల నిర్లక్ష్యం,సర్పంచ్ స్థాయి పర్యవేక్షణ లోపం కారణంగానే ఈ పరిస్థితి ఏర్పడిందని ఆరోపించారు.నిర్మాణ సమయంలో సరైన పదార్థాలు వినియోగించకపోవడం, పనులను ప్రమాణాల ప్రకారం నిర్వహించకపోవడం వల్ల రోడ్లు దీర్ఘకాలం నిలవడం లేదని పేర్కొన్నారు.రోడ్లు దెబ్బతినడం వల్ల వాహనదారులు, పాదచారులు ప్రమాదాలకు గురయ్యే అవకాశం ఉందని గ్రామస్తులు ఆందోళన చెందుతున్నారు.ముఖ్యంగా వర్షాకాలంలో ఈ గుంతలు మరింత ప్రమాదకరంగా మారే అవకాశం ఉందని చెప్పారు.ఇలాంటి నాణ్యతలేని పనుల కారణంగా ప్రభుత్వ నిధులు వృథా అవుతున్నాయని, సంబంధిత అధికారులు వెంటనే స్పందించి పనులను పరిశీలించి, బాధ్యులపై చర్యలు తీసుకోవాలని గ్రామ ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.నాణ్యతా ప్రమాణాలు పాటిస్తూ, దీర్ఘకాలం ఉపయోగపడే విధంగా సీసీ రోడ్ల నిర్మాణం చేపట్టాలని ఉప సర్పంచ్ సభావత్ ఉషారాణి,గ్రామస్థులు కోరుతున్నారు.





## దాతలు ముందుకు రావాలి

**ప్రజాపక్షం/రామన్నపేట :** మునిపంపుల గ్రామ పంచాయతికి వీధి దీపాల బహుకరణ అభినందనీయమని గ్రామ సర్పంచ్ బొడ్డుపల్లి వెంకటేశం అన్నారు. గ్రామ పంచాయతికి గ్రామ వాస్తవ్యులు ఇన్స్పెక్టర్ ఆఫ్ పోలీస్(నల్లగొండ) గంటెపాక చిన్న నర్సింహా సహకారంతో పద్దెనిమిది రూ.10 వేలు విలువగల ఎల్ఈడి లైట్లు బహుకరించారు. స్థానిక గ్రామ పంచాయతి కేంద్రంలో సర్పంచ్ పాలకవర్గం చేతులమీదుగా బహుకరించారు. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ వెంకటేశం మాట్లాడుతూ గ్రామంలో వీధి దీపాల అవసరాన్ని గుర్తించి బహుకరించినందుకు ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ ఉపసర్పంచ్ తాళ్ళ క్రాంతి కుమార్, వార్డు సభ్యులు మేకల రాములు, గంటెపాక శ్రీను, గ్రామస్తులు మామిండ్ల కుమార్, ఆకుల శేఖర్, మామిండ్ల నర్సింహా, సిరిసాల కళ్యాణ్, గంగదారి నవీన్, ఎండీ రఫీక్ తదితరులు పాల్గొన్నారు.

## పోచంపల్లి కేంద్రంగా నియోజకవర్గం ఏర్పాటు చేయాలి



**ప్రజాపక్షం/భూదాన్ పోచంపల్లి :** భూదాన్ పోచంపల్లి కేంద్రంగా నియోజకవర్గం ఏర్పాటు చేయాలని కాంగ్రెస్ పార్టీ మాజీ జిల్లా కార్యదర్శి బందారు ప్రకాశ్ రెడ్డి 1, 2వ కౌన్సిలర్స్ శ్రీరామ మంజుల లింగస్వామి కొండమడుగు ఎల్ల స్వామి అభిప్రాయపడ్డారు. పార్లమెంటరీ నియోజకవర్గం పునర్విభజనలో భాగంగా ఎంతో చారిత్రక నేపథ్యం బెస్ట్ హెరిటేజ్ విలేజ్ యునెస్కో అవార్డు పొంది ప్రపంచ ప్రఖ్యాతిగాంచిన పట్టు చీరల నిలయమైన పోచంపల్లి అన్ని రకాలుగా నియోజకవర్గ ఏర్పాటుకు సరైనదిగా భూదాన ఉద్యమ చరిత్రకు నిజమైన నిదర్శనంగా పోచంపల్లి పట్టణాన్ని సరైన న్యాయబద్ధంగా నియోజకవర్గం కోసం ప్రకటిస్తే ఈ ప్రాంత ప్రజలకు అభివృద్ధి సంక్షేమ సాధ్యమవుతుందని ఆయన అన్నారు.

## బిసి గురుకులంలో మెగాహెల్త్ క్యాంప్



**ప్రజాపక్షం/నందికొండ:** ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా జిల్లా వైద్యాధికారులు బుధవారం బీసీ గురుకుల పాఠశాలలో మెగాహెల్త్ క్యాంపును నిర్వహించారు.ఈకార్యక్రమాన్ని పాఠశాల ప్రిన్సిపల్ రవికుమార్,వైద్యాధికారులు ప్రారంభించారు. ఈ సందర్భంగా వైద్య బృందం విద్యార్థుల ఆరోగ్య పరిస్థితులను సమగ్రంగా పరిశీలించింది.మెడికల్ ఆఫీసర్ డాక్టర్ రాంబాబు,చిన్నపిల్లల వైద్య నిపుణులు డాక్టర్ మంగుతా,డాక్టర్ రజిత,కంటి వైద్య నిపుణులు డాక్టర్ మానస,డెంటిస్ట్ డాక్టర్ నాగజ్యోతి పాల్గొని సుమారు 600 మంది విద్యార్థులకు మూడు రకాల వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సునీత,లలిత,హెల్త్ సూపర్వైజర్ రజిని తదితరులు పాల్గొన్నారు.

## బైక్ మెకానిక్-సర్వీసింగ్ సెంటర్ ప్రారంభం



**ప్రజా పక్షం/నకిరేకల్ :** నకిరేకల్ పట్టణంలోని తిప్పర్తి రోడ్డు లో నూతనంగా ఏర్పాటు చేసిన అన్విక బైక్ మెకానిక్ సర్వీసింగ్ సెంటర్ ను బుధవారం మున్సిపల్ చైర్ పర్సన్ చౌగోని రజిత శ్రీనివాస్ ప్రారంభించారు.ఈకార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు పన్నాల రాఘవరెడ్డి,లింగాల వెంకన్న,కొండ వెంకన్న, కార్మిక సంఘాల నాయకులు శిగ శ్రీను పాల్గొన్నారు.